క్లుప్తంగా

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి ఆదివారం స్థానిక తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని మాగుంట కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానికంగా జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాత్రి 11.30 గంటలకు లాయరుపేటలోని సాయిబాబా ఆలయంలో 2024 జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. సోమవారం ఉదయం 8 గంటలకు మాగుంట కార్యాలయంలో మాగుంట అభిమానులు నిర్వహించే నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొంటారు. ఉదయం 10.30 గంటలకు ఒంగోలు రైల్వేస్టేషన్‌లో మాల్దాటౌన్- బెంగళూరు నూతన అమృత్ భారత్ రైలు స్వాగత కార్యక్రమానికి హాజరవుతారు. మరలా 11 గంటలకు తన కార్యాలయంలో అభిమానులు నిర్వహించే నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొంటారు. సాయంత్రం 3 గంటలకు స్థానిక కబాడీపాలెంలోని కమ్యూనిటీ హాలులో జిమ్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.

6 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

చీమకుర్తి: బూచేపల్లి యూత్ ఆధ్వర్యంలో జనవరి 6 నుంచి బూదవాడ పంచాయతీ పరిధిలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు సంజీవ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు రూ.15,116, రూ.12,116, రూ.9,116ను ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా అందిస్తారని వెల్లడించారు.

వలంటీర్లకు నియామకపత్రాల అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

చీమకుర్తి: మండలంలోని మంచికలపాడు సచివాలయం పరిధిలో నూతనంగా నియమించిన వలంటీర్లకు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు చేతుల మీదుగా శనివారం నియామక పత్రాలు అందించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో చురుగ్గా పనిచేయాలని వారికి ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, నాయకులు కడియాల మల్లికార్జున, అత్యాల కౌశిక్, జడ సుగుణరావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత



వృద్ధులకు నిత్యావసరాలు అందజేస్తున్న తన్నీరు ఆంజనేయులు తదితరులు

ఒంగోలు: ఏపీ వడియరాజుల సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక విశ్వసేవిక వృద్ధుల ఆశ్రమానికి నిత్యావసరాలు, కూరగాయలు, పండ్లు, రొట్టెలను వడియరాజుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తన్నీరు ఆంజనేయులు మాట్లాడుతూ వడియరాజుల సేవా సంఘం ఏర్పడినప్పటినుంచి అనేక సేవా కార్యక్రమాలను సంఘం తరుపున నిర్వహిస్తున్నామన్నారు. మహిళా అధ్యక్షురాలు చల్లానాగేశ్వరమ్మ, మాట్లాడుతూ భవిష్యత్‌లోను సేవా కార్యక్రమాలు ముమ్మరం చేస్తామన్నారు. వడియరాజుల సేవా సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు తన్నీరు గజేంద్ర, జిల్లా అధ్యక్షుడు తన్నీరు వీర సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్సులు, పెన్నుల పంపిణీ



నోట్సులు, పెన్నులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ తిరుమలరావు

ఒంగోలు: క్రిస్మస్, నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని స్థానిక నీలంపాలెంలోని ఆర్‌సీఎం యూత్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేశారు. స్థానిక పాత మార్కెట్ సెంటర్‌లో ఉన్న సెయింట్ థెరిస్సా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 6వ డివిజన్ కార్పొరేటర్ చల్లా తిరుమలరావు చేతుల మీదుగా వీటిని అందించారు. నీలంపాలెం ఆర్‌సీఎం యూత్ అధ్యక్షుడు పి.బాలు, నాయకులు కరుణాకర్, కమలాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

- పాట్నా ఐఏఎస్ అధికారి రామచంద్రుడు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఐఏఎస్ అధికారి రామచంద్రుడు, పక్కన ఎంపీపీ అరుణ, నాయకులు

మద్దిపాడు: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రతి అర్హునికీ చేరేలా చూడాలని బీహార్ క్యాడర్ ఐఏఎస్ అధికారి ఎం.రామచంద్రుడు సూచించారు. మండలంలోని కొలచనకోట, వెల్లంపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం రైతులు, కూలీలు పనుల కోసం వలసలు పోకుండా ఉండే నిమిత్తం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పలు పథకాలు చేపడుతోందని తెలిపారు. ఆయా పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత 30 సంవత్సరాలుగా రసాయన ఎరువుల వాడకం మూలంగా పొలాలు గుల్లబారిపోయి నిస్సారమైపోయాయని తెలిపారు. అందువలన సేద్యాన్ని అధునాతన పద్ధతుల్లో చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగానే నానో టెక్నాలజీ ఉపయోగిస్తూ ఎరువులు తయారు చేయడానికి అనుమతులిచ్చిందన్నారు. నానో ఎరువుల వలన అధికంగా ఎరువులు వేయాల్సిన అవసరం లేకుండా పోతోందన్నారు. డ్రోన్ వ్యవస్థను ప్రోత్సహిస్తోందని, డ్రోన్ ద్వారా వేగంగా ఎరువులు, పురుగు మందులు పంట పొలాలపై చల్లుకోవచ్చని తెలిపారు. కూలీల సమస్య ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా ఎరువులు చల్లుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం పంపిన క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులు వారిశాఖల పరిధిలో కేంద్ర ప్రభుత్వ నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న పథకాలను వివరిస్తూ లబ్ధిదారులతో సభలో మాట్లాడించారు. అనంతరం సభా ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వ సహాయంతో నడుస్తున్న యూనిట్లు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతనం డ్రోన్‌తో పొలంలో ఎరువులు పిచికారీ చేసే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పరిషత్ ఉప విద్యాశాఖాధికారి ఎస్.సుబ్బారావు, సీఈఓ జాలిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ జేడీఏ శ్రీనివాసరావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రజనీకుమారి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాయపాటి విల్సన్, సీనియర్ నాయకులు గుడ్డపాతల రవి, జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు బెజవాడ రాము, బొమ్మల రామాంజనేయులు, గ్రామ సర్పంచ్‌లు డొక్కా మరియమ్మ, అనిల్, బీజేపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి రమణ, నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..



అల్లూరులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



గుండ్లాపల్లి క్రీడా మైదానంలో క్రికెట్ ఆడుతున్న విద్యార్థినులు

మద్దిపాడు: మండలంలోని అన్ని సచివాలయాలకు చెందిన క్రికెట్ టీంలు గుండ్లాపల్లి, ఇనమనమెళ్లూరు, దొడ్డవరం గ్రామాల్లోని పాఠశాలల క్రీడా మైదానాల్లో పోటీ పడుతున్నాయి. మూడు పాఠశాలలకు ఆరు చొప్పున సచివాలయాలను అనుసంధానం చేశారు. ఈ క్రమంలో శనివారం నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. మూడునాలుగు రోజుల్లో సచివాలయాల స్థాయి క్రికెట్ పోటీలు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో గుండ్లాపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థినులు క్రికెట్ ఆడి గెలుపొందినట్లు పాఠశాల పీడీ మాధవీలత తెలిపారు. మూడు క్రీడా మైదానాలలో యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పీడీలు, వలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కొత్తపట్నం: క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత అన్నారు. మండలంలోని అల్లూరు-1, 2, ఆలూరు సచివాలయాల్లో ఆడుదాం ఆంధ్రలో భాగంగా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని పోటీల్లో సత్తా చాటాలన్నారు. అల్లూరు ఎంపీటీసీ మిట్నసల శాంతారావు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కో ఆప్షన్ సభ్యుడు షేక్ బాజీ మాట్లాడుతూ ఆటలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. గెలుపోటములను ప్రతి ఒక్కరూ సమానంగా తీసుకోవాలన్నారు. ఈఓఆర్డీ ఏ.బాలచెన్నయ్య, ఏపీఎం షేక్ రజియా సుల్తాన్ బేగం, పంచాయతీ కార్యదర్శి ఐపీ రామారావు, హిమబిందు, పీడీలు ఎం.సుజన, పి.యశోధ, బి.కరీమ్, సీహెచ్ శ్రీను, కె.జ్యోతి, డి.సాయికిషోర్, పి.భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల శంఖారావం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సైదా నాయక్ తదితరులు

ఒంగోలు: గిరిజనుల శంఖారావం వాల్‌పోస్టర్‌ను గిరిజన ప్రజా సమాఖ్య జిల్లా అధ్యక్షులు సైదానాయక్ శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషిని ప్రశంసించడంతో పాటు గిరిజనుల విన్నపాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి మరిన్ని ఫలాలను జాతికి అందించేందుకు జనవరి 7న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజన శంఖారావం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులకు క్యాబినెట్‌లో మంత్రిపదవితో పాటు ఉప ముఖ్యమంత్రి పదవిని కేటాయించడం, రాష్ట్రంలో గిరిజనులకోసం ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు, తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైలం పాలకమండలిలో గిరిజనులకు స్థానం కల్పించడం, శాసనమండలిలో గిరిజనులకు అవకాశం కల్పించడం, జీసీసీ, ట్రైకార్ వంటి కార్పొరేషన్‌లకు చైర్మన్‌లను నియమించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు, సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో స్థానిక సంస్థలలో వివిధ కార్పొరేషన్లలో గిరిజనులకు సముచిత స్థానం కల్పించారన్నారు. గిరిజన ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచే లక్ష్యంతో , గిరిజనుల ఆత్మగౌరవానికై జరిగే ఈ గిరిజనుల శంఖారావం కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు తరలిరావాలని జిల్లా అధ్యక్షుడు సైదా నాయక్ పిలుపునిచ్చారు. రామునాయక్, వేణునాయక్, సమనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డులోని వెలసియున్న పొలిమేర అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మార్గశిర మాసం శనివారం అర్చకులు రాము శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, స్వామి మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించి వివిధ రకాల పూలతో అలంకరించి ఆకుపూజ చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణ చేశారు.

ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న డీఈవో సుబ్బారావు

ఒంగోలు: బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశమందిరంలో శనివారం ప్రాథమికోన్నత , ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, మండల నోడల్‌పర్సన్లకు ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ ఆఫీసర్ కొప్పోలు అశోక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ట్యాబ్‌ల వినియోగాన్ని వివరించారు. అనంతరం డీఈఓ సుబ్బారావు మాట్లాడుతూ ట్యాబ్‌ల వినియోగంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రతి విద్యార్థి ఒక సాంకేతిక నిపుణుడుగా మారేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఏసర్ ట్యాబ్‌ల వినియోగం, ట్యాబ్ యాక్టివేషన్, పాఠశాలల్లో బార్‌కోడ్ స్కాన్ చేసే విధానం, బైజూస్‌కు సంబంధించి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే విధానం, ట్యాబ్‌లో ఉన్నటువంటి యాప్‌లు, వాటి వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన నైపుణ్యాలు అందించడం సాధ్యపడుతుందన్నారు. అనంతరం 5 జిల్లాలకు ప్రకాశం జిల్లా నుంచి ట్యాబ్‌లను పంపిణీ చేయగలగడాన్ని సమర్థంగా నిర్వహించారంటూ డీఈఓ వీఎస్ సుబ్బారావు, జిల్లా నోడల్ అధికారి కొప్పోలు అశోక్‌లను రాష్ట్ర నోడల్ అధికారి సీహెచ్ రమేష్ అభినందించారు. కార్యక్రమంలో 496 పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు, 76 మంది నోడల్‌పర్సన్లు హాజరయ్యారు.


అనాథలకు ఆర్థికసాయం



వృద్ధులకు పండ్లు అందిస్తున్న శ్రీసూర్య విద్యానికేతన్ విద్యార్థులు

ఒంగోలు: రెండు అనాథశ్రమాలను సందర్శించి వారికి అవసరమైన దుప్పట్లు, పండ్లు, నిత్యావసరాలను స్థానిక అన్నవరప్పాడులోని శ్రీసూర్య విద్యానికేతన్ విద్యార్థులు అందించారు. పాఠశాల కరస్పాండెంట్ రామాల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు స్థానిక అన్నవరప్పాడులోని శివం ఫౌండేషన్‌కు దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లు, మాస్కులు అందించారు. స్థానిక కర్నూల్‌రోడ్డులోని విష్వక్సేన ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బిస్కెట్లతో పాటు ఆశ్రమానికి కందిపప్పు, బియ్యం, నూనె, ప్రతి ఒక్కరికీ మాస్కులు అందించారు. కరస్పాండెంట్ రామాల వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ సామాజిక హితాన్ని కాంక్షించేలా చిన్నారుల్లో పరివర్తన తీసుకువచ్చేందుకు కార్యక్రమం ఎంతో తోడ్పడిందన్నారు.ప్రిన్సిపాల్ బీఎస్ఆర్ శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పీడీసీసీబీ కార్యాలయంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ ప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: జిల్లా సహకార కేంద్రబ్యాంకు కార్యాలయంలో పీడీసీసీబీ చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా కష్టపడి పనిచేసి బ్యాంకును అభివృద్ధి చేయాలన్నారు. బ్యాంకు ఖాతాదారులు, డిపాజిటర్లకు, ప్రముఖులు, అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అందరూ బాగుండాలని, బ్యాంకుకు మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. పీడీసీసీబీ సీఈఓ ఈ.కోటిరెడ్డి, జీఎం. రాఘవయ్య, ప్రకాష్, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం



పొలాలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ బృందం

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు బాధ్యులు పేర్కొన్నారు. మండలంలోని ఉలిచి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి రాధ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పొదుపు సంఘం సభ్యులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతను వివరించారు. రసాయనిక వ్యవసాయంతో భూమి నిస్సారమవుతుందన్నారు. ఒంగోలు ఏపీఎం గోపినాథ్, సీసీ రమణ, వీఏఏ బాలక్రిష్ణ, యూనిట్ ఇన్‌చార్జి రాధ, సింగమనేని, వాకా మాధవి, ఐసీఆర్ శ్రీనివాసరావు, మరియమ్మ, క్రిష్ణ వేణి, రాణి తదితరులు పాల్గొన్నారు.

16న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కొత్తపట్నం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కొత్తపట్నంలో ఈనెల 16న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మేడా సుబ్బారావు ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, మూడో బహుమతి రూ.25 వేలు, నాల్గవ బహుమతి రూ.12,500 అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9948124772, 9676919195 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా తాతా వీర రాఘవస్వామి జయంతి

ఒంగోలు: బాపూజీ కాంప్లెక్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు తాతా వీర రాఘవస్వామి 105వ జయంతి శనివారం కాంప్లెక్స్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా కాంప్లెక్స్‌లోని బ్యాంకు ముందు ఉన్న వీర రాఘవస్వామి విగ్రహానికి ఒంగోలు సూపర్‌బజార్ చైర్మన్ తాతా బదరీ, కాంప్లెక్స్ చైర్మన్ కోడూరి సత్యన్నారాయణ, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తాత ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ కాంప్లెక్స్‌లో 470 షాపులకు పైగా నిర్మాణం చేయించి వాటి అభివృద్ధికి రాఘవస్వామి చేసిన కృషిని కొనియాడారు. అనంతరం కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు వందమందికి దుప్పట్లు, పండ్లు పంపిణీచేశారు.

సిబ్బంది సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్



సమావేశంలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్

ఒంగోలు టౌన్: జీజీహెచ్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందికి ఎంఓయూ ప్రకారం అన్ని రకాల రాయితీలు వర్తింపచేయాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్ స్పష్టం చేశారు. జీజీహెచ్‌లో శనివారం లేబర్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పలుమార్లు పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందితో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. రాయితీల విషయంలో యాజమాన్యంతో చర్చించిన తరువాత సమగ్ర వివరాలతో రావాలని ఏజెల్ ప్రతినిధులకు సూచించారు. కార్మిక సంఘాలు, అధికారులు అడిగిన సమాచారాన్ని అందించే బాధ్యత ఏజెల్ యాజమాన్యందే అని చెప్పారు. ఈ సందర్భంగా వేతనాలు, సౌకర్యాలకు సంబంధించి కార్మికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఐడీ కార్డ్స్, యూనిఫాంలను సకాలంలో అందించాలని సూపరింటెండెంట్ ఆదేశించారు. సమావేశంలో ఆర్‌ఎంఓ డాక్టర్ బి తిరుమల రావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకరరావు, డాక్టర్ బాలాజీ నాయక్, విజిలెన్స్ కమిటీ సభ్యులు బెంజిమెన్, కిషోర్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు





కార్మికులతో చెత్తను వాహనంలోకి ఎక్కిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

- కంట్రోల్ రూం 08592 227799 ఏర్పాటు
- పారిశుధ్య కార్మికులు సమ్మె బాట పట్టటంతో నగర కమిషనర్ ప్రత్యేక చర్యలు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మెబాట పట్టటంతో ఎక్కడా పారిశుధ్య పనులకు లోటు లేకుండా ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పారిశుధ్య పనుల పర్యవేక్షణకు డివిజన్ల వారీగా ప్రత్యేకంగా అధికారులను కేటాయించారు.నగర పాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూంను కూడా ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రజలు ఆయా ప్రాంతాల్లో ఉన్న పారిశుధ్య పనులకు సంబంధించి సమస్యలను కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 08592 227799 తెలియజేయాలని కోరారు. కార్యాలయంలో అర్ధరాత్రి 12 గంటల వరకు ఫోన్‌కు అందుబాటులో ఉండేలా ముగ్గురు సిబ్బందిని కేటాయించారు. హెల్త్ అసిస్టెంట్ కిషోర్ కుమార్, పీహెచ్ వర్కర్ మంతిన సుజాత, హెల్త్ అసిస్టెంట్ ఎస్‌డి.బాష ఫోన్ వద్ద ఫోన్ వద్ద అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు నగరపాలక సంస్థ అధికారులకు సమాచారాన్ని అందిస్తుంటారు.

పది మంది పర్యవేక్షణ అధికారుల కేటాయింపు...

నగరంలో పారిశుధ్య కార్మికులు తిరిగి విధుల్లోకి చేరే వరకు నగరాన్ని ఐదు డివిజన్లుగా విభజించి ప్రత్యేకంగా పర్యవేక్షణ అధికారులను నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు కేటాయించారు. నగరంలోని 50 డివిజన్లను ఐదు పారిశుధ్య డివిజన్లుగా విభజించి ఒక్కో డివిజన్‌కు ఇద్దరు చొప్పున అధికారులను ప్రత్యేకంగా కేటాయించారు. ప్రతి పది డివిజన్లకు ఇద్దరేసి చొప్పున అధికారులను నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం నుంచి రాత్రింబవళ్లు పర్మినెంట్ పారిశుధ్య కార్మికులతో పాటు అదనంగా కొంతమందిని కేటాయించి మరీ పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. నగర కమిషనర్ ప్రత్యేకంగా రాత్రి, పగలు జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

శిల్పుల వృత్తి నైపుణ్యానికి కృషి చేస్తా



కలెక్టర్‌కు చిత్రాన్ని అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘు సభ్యులు

ఒంగోలు అర్బన్: సింగరాయకొండకు చెందిన దారు శిల్పి ఆదిమూలం ఈశ్వరాచారి స్వహస్తాలతో చెక్కపై చెక్కిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి చిత్రాన్ని శనివారం ప్రకాశంభవనంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌కు అందచేసి సత్కరించారు. ఈ సందర్భంగా దారు శిల్పుల వృత్తి నైపుణ్యాన్ని పెంచేందుకు నైపుణ్య కేంద్రాన్ని ఉర్పాటు చేసేందుకు సహకరిస్తానని కలెక్టర్ వారికి తెలిపారు. కనిగిరిలోని ఎంఎస్ఎంఈ 95 గ్రాంట్‌తో ఉడ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌కి 50 సెంట్ల భూమిని కేటాయించాలని శిల్పి కలెక్టర్ కోరుతూ వినతిపత్రం అందచేసారు. కలెక్టర్ కలిసిన వారిలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి సుతారం శ్రీనివాసులు, కార్యదర్శి ఫణిదపు సుధాకర్, గోనుగుంట బ్రహ్మేంద్ర కుమార్, పొన్నపల్లి బ్రహ్మానందం ఉన్నారు.